ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 9 డిసెంబరు 2025



వైభవంగా యువజనోత్సవం

- కళాకారులతో ఏఎన్‌యూ కళకళ
- విద్యార్థులు చదువుతో పాటు కళలలోనూ రాణించాలి: వీసీ

6




మణిపూర్ విద్యార్థినుల నృత్యాలు

రూపాయి ప్లాన్.. పనిచేసింది

- నయా ఆఫర్లతో ఆకట్టుకుంటున్న బీఎస్ఎన్ఎల్
- రూపాయి ప్లాన్‌తో ప్రజల చెంతకు
- ఆఫర్ నెలాఖరు వరకు పొడిగింపు..

6





అమరావతి జిగేల్ జిగేల్

- కోర్ కేపిటల్ ఏరియాలో జరుగుతున్న పనులు
- అబ్బురపరుస్తున్న రాజధాని నైట్ వ్యూ

6

అమ్మ ఫోను పిల్లలకు చేటు



- గర్భిణులు ఫోన్ వాడితే పిల్లలకు బ్రెయిన్ ట్యూమర్..!
- గుంటూరులో వెలుగు చూసిన రెండు కేసులు
- అరుదైన శస్త్రచికిత్సతో ట్యూమర్ల తొలగింపు
- కిమ్స్ న్యూరో సర్జరీ వైద్యనిపుణుల ఘనత

6

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

- 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండి స్వాధీనం

6

ఖాకీ కుమారుడే.. కారకుడు!



ఐదుగురు విద్యార్థులను బలితీసుకున్న.. చోర్ గ్యాంగ్

- హైవేలో కారు ప్రమాదానికి కారణం ఈ ఆగంతకులే
- గ్యాంగ్‌లీడర్ నరసరావుపేటలోని పోలీసు అధికారి పుత్రరత్నం
- తండ్రి రక్షణ, పోలీసుల అండతో 'మద'మెక్కి నేరాలు
- చిలకలూరిపేట పోలీసుల అదుపులో నిందితులు
- విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి..
- రంగంలోకి దిగిన ఐజీ త్రిపాఠి.. ఎస్పీ కృష్ణారావు



ఇంజనీరింగ్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులను ఆ ఐదుగురు యువకుల ముఠా బలితీసుకుంది. ఈ గ్యాంగ్ అక్రమ దందాకు మంచి భవిష్యత్తు కలిగిన యువకులు అసువులు బాసారు. చిలకలూరిపేట బైపాస్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదానికి నరసరావుపేటకు చెందిన ఈ గ్యాంగే కారణమని పోలీసులు నిర్ధారించినట్లు సమాచారం. ఈ కేసుపై ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ బీ కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు విద్యార్థుల మృతికి కారకులైన గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్‌లో మొత్తం ఐదుగురు యువకులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ గ్యాంగ్ లీడర్.. నరసరావుపేటలో పనిచేస్తున్న పోలీస్ అధికారి కుమారుడు అని తేల్చారు. రవాణశాఖ అధికారులమంటూ వాహనదారులను బెదిరిస్తూ.. కొంతకాలంగా ఈ ముఠా వసూళ్లకు పాల్పడుతోంది.

చిలకలూరిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బైపాస్‌లో కారు ప్రమాదానికి సంబంధించిన సీసీ పుటేజీ బయటకు రావడంతో నరసరావుపేట గ్యాంగ్ దందా బట్టబయలైంది. మొదట రవాణశాఖ అధికారులు ట్రాలీని రోడ్డులో నిలపడం వల్లే.. కారు లారీని ఢీకొన్నదన్న ప్రచారం జరిగింది. దీంతో అప్రమత్తమైన రవాణ శాఖ అధికారులు హైవేలో ఉన్న అన్ని సీసీ కెమె రాల్లోని పుటేజీని (మిగతా 8వ పేజీలో)

సంక్షేమంపై ఏఐ

సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు హెచ్‌పీటీఎస్ యాప్..

- ఏఐ సాయంతో లోపాలపై ఉన్నతాధికారులకు సమాచారం
- ఉదయం స్టడీ అవర్స్ నుంచి నిత్య పరిశీలన


ఉదయం స్టడీ అవర్స్‌ను పర్యవేక్షిస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్

గుంటూరు(విద్య) డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించే వెల్ఫేర్ ఆఫీసర్ల పనితీరుకు చెక్ పెట్టడంతోపాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా కృత్రిమ మేధ(ఆర్టిఫియల్ ఇంటిలిజెన్స్) సహకారంతో.. హాస్టల్ పెర్ఫామెన్స్ ట్రాకింగ్ సిస్టం (హెచ్‌పీటీఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కృత్రిమ మేధ సహకారంతో పనిచేసే ఈ యాప్ ద్వారా ప్రతి హాస్టల్లో క్షేత్రస్థాయిలో (మిగతా 8వ పేజీలో)

మంపు వీడని మున్సిపల్ అధికారులు

- క్వారీ నింపుకోవడంలో నిర్లక్ష్యం
- రెండు నెలలుగా మోటారుకు మరమ్మతులు


కుడి కాలువ నుంచి నీటిని చేరవేసే పైపులైన్లు

మాచర్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. కుడి కాలువ ద్వారా మున్సిపల్ క్వారీని నింపుకోవడంలో తాత్సారం చేస్తున్నారు. సాగర్ కుడి కాలువ ద్వారా పురపాలక సంఘానికి నీటిని చేరవేసేందుకు బొంబాయి కంపెనీ వద్ద పంపుహౌస్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఐదు మోటార్లను బిగించారు. వీటిలో 50, 30, 20, 10 హెచ్‌పీ మోటార్ల ద్వారా పంపుహౌస్‌కు నీటిని చేరవేస్తున్నారు. అయితే కుడి కాలువ నుంచి మున్సిపల్ క్వారీలో నీటిని నింపేందుకు వినియోగించే 54 హెచ్‌పీ మోటారు ఓపెన్‌వెల్ రెండు నెలల క్రితం మరమ్మతులకు గురైంది. ఇది నేటికీ వినియోగంలోకి రాలేదు. మున్సిపల్ రిజర్వాయర్‌ను పూర్తిగా నీటితో నింపుకుంటే వేసవిలో నీటి సమస్యను నివారించుకోవచ్చు. ఈ దిశగా అధికారులు అడుగులు పడడం లేదనే విమర్శలున్నాయి. అంతేకాకుండా పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ బోర్ల మరమ్మతులు వారాల తరబడి చేయడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మోటారుకు మరమ్మతులు జరిపి.. మున్సిపల్ క్వారీని నింపేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


మోటార్లు ఏర్పాటు చేసిన పంపు హౌస్

మట్టిని మింగేస్తున్నారు..

- ఆటవీ భూములను కొల్లగొడుతున్నారు..
- చేజర్ల ప్రాంతంలో యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే లూటీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అక్రమార్కులు ఆటవీ భూములనూ వదలడం లేదు. నరకరికల్లు మండలం చేజర్ల ప్రాంతంలో మట్టిని లూటీ చేస్తున్నారు. ఆటవీ భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. అధికారం అండతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అక్రమ మైనింగ్‌కు అడ్డు అదుపు లేకుండా పోయింది. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇటీవల నరకరికల్లు పోలీసులు రెండు మట్టి లారీలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఒకటి రెండు రోజులు మట్టి తవ్వకాలు నిలిపేసిన అక్రమార్కు లు ఆదివా రం నుంచి కొన సాగిస్తున్నారు.


ఆటవీ భూముల్లో జరుగుతున్న మైనింగ్

మట్టికి డిమాండ్..

చేజర్ల ఆటవీ ప్రాంతాన్ని అక్రమ మైనింగ్‌కు అక్రమార్కులు ఎంచుకున్నారు. ఇక్కడ గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉండటంతో టాక్టర్లు.. టిప్పర్లలో రవాణా చేస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, ఆటవీ శాఖల అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. అధికార పార్టీకి చెందిన నేతలు ఈ అక్రమ మైనింగ్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ మైనింగ్‌ను ఎవరూ ఆపలేరని వారు బహిరంగంగానే చెబుతున్నట్లు తెలిసింది. మట్టి లోడుతో కుంకలగుంట, చేజర్ల ప్రాంతాల నుంచి వేగంగా లారీలు, ట్రాక్టర్లు దూసుకుపోతుండంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల అక్రమంగా మైనింగ్ చేస్తున్న రెండు లారీలను సీజ్ చేసిన పోలీసులు.. అధికార పార్టీ నేతల ఒత్తితో 24 గంటల్లోపే ఎటువంటి కేసు నమోదు చేయకుండా వదిలేశారు. ఫిర్యాదులు రావడంతో మైనింగ్ అధికారులు ఒకటి రెండు చోట్ల కొలతలు తీసి, చర్యలు తీసుకోకుండా మిన్నకున్నారు. అక్రమమార్కులతో సంబంధిత అధికారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆటవీ భూముల్లో జరగుతున్న అక్రమ మైనింగ్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వ్యర్థం..తప్పదు అనర్థం

చేపలకు ఆహారంగా మాంసపు వ్యర్థాలు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలను వినియోగించకూడదని ప్రభుత్వం నిషేధం విధించినా.. కొందరు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. నరసరావుపేట మండలంతో పాటు.. జిల్లాలోని పలు మండలాల్లో చేపల చెరువుల యజమానులు నిత్యం చికెన్ వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ప్రతిరోజు పట్టణాలు, గ్రామాల్లోని చికెన్ దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను కేజీ రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వాహనాల్లో డ్రమ్ములు ద్వారా చేపల చెరువులకు తరలిస్తున్నారు. చికెన్ వ్యర్థాలను తిన్న చేపలతో అనారోగ్య సమస్యలు వస్తాయని ప్రభుత్వం.. చికెన్ వ్యర్థాల వినియోగం నిషేధించింది. అయినా కొందరు చేపల చెరువుల యజమానులు ఈ ఆదేశాల పెడచెవిన పెడుతున్నారు. అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చికెన్ వ్యర్థాల వినియోగాన్ని పర్తిగా అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నరసరావుపేట మండలంలో చేపల చెరువులో ఉన్న చికెన్ వ్యర్థాలు

తగ్గని మమకారం

- మిరప సాగు 1.10 లక్షల ఎకరాలు
- పోటెత్తుతున్న తెగుళ్లు..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ధరలు పతనమైనా.. తెగుళ్లు దాడి చేసినా.. మిర్చి సాగు విస్తీర్ణంలో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. జిల్లాలో మిరప పంటను ఈ ఏడాది 1,10,835 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది మిరపకాయలకు ధర లేకపోవడం.. తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులు.. సాగుకు దూరంగా ఉంటారని ఉద్యాన శాఖ అంచనా వేసింది. అయితే సాగు విస్తీర్ణం గతేడాది కంటే సాగు పెరిగిందే తప్ప తగ్గలేదు. 308 ఎకరాలు పెరిగినట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. గత సంవత్సరం 1,10,527 ఎకరాల్లో మిర్చి రైతులు సాగు చేశారు. అయితే, మిరప పంటను తెగుళ్ల వెంటాడుతున్నాయి. దీంతో సాగు వ్యయం పెరుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా మంచి దిగుబడి, ధర ఉంటుందన్న ఆశతోనే రైతులు మిరప పంటను వీడలేదు. తెగుళ్ల నివారణకు పురుగు మందులు రైతులు వినియోగిస్తున్నారు. ముఖ్యంగా నల్లతామర, ఎర్రనల్లి మిరప పంటను ఆశిస్తున్నాయి. నల్ల తామర మూడేళ్లుగా పంటను నష్టప రుస్తోంది.

మిరప సాగు వివరాలు..

సంవత్సరం	సాగు (ఎకరాల్లో)
2022-23	1,46,310
2023-24	1,24,838
2023-25	1,10,527
2025-26	1,10,835


వినుకొండ: దొండపాడులో ఎండుతెగులు సోకిన పంట పొలం



ఈ నూనె.. ఆ నూనె కాదు!

పూజ నూనె పేరుతో కల్తీ కొబ్బరి నూనె విక్రయాలు

వినుకొండటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కొబ్బరికి మంచి డిమాండ్ ఏర్పడింది. కోనసీమలో కొబ్బరి తోటలు దెబ్బతినడంతో కొబ్బరికాయ, కొబ్బరి బోండాలు ధరలు చూస్తే.. కొనే పరిస్థితి కనిపించడం లేదు. కాయ ఒకటికి రూ.50, ఎండు కొబ్బరి కేజీ రూ.350ల నుంచి రూ.400 వరకు మేర డిమాండ్ పెరిగింది. కొంత మంది గ్రామాల్లో తిరుగుతూ పచ్చి కొబ్బరి చిప్పలు 2 కేజీలకు సరాసరి అరకిలో చొప్పున పంచధార ఇస్తూ సేక రిస్తున్నారు. కొబ్బరి చిప్పలు కూడా కొంటుండడంతో.. ఆలయానికి వెళ్లిన ప్రతి ఒక్కరూ కొబ్బరి చిప్పలను దాచి పెట్టడం పరిపాటిగా మారింది.

కల్తీ కొబ్బరినూనె విక్రయం

వర్తక దుకాణాల్లో దీపారాధన కోసం నువ్వుల నూనె అడిగిన వారికి.. నాశిరకం కొబ్బరి నూనెకు రంగులు కల్తీ చేసి విక్రయిస్తున్నారు. దీనికి మం చి డిమాండ్ ఏర్పడటంతో కార్తీక మాసంలో కొబ్బరి నూనె కల్తీ వ్యాపారంతో లక్షలు గడిస్తున్నారు. వినుకొండ, నరసరావుపేట తదితర ప్రాంతాల నుంచి బాటిళ్లను దిగుమతి చేసుకొని అమాయకులకు వ్యాపారులు అంటకడుతు న్నారు. ఇప్పటికైనా కల్తీ నూనెలపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కారుమంచి వీహెచ్‌ఏ విధుల నుంచి తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శావల్యాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచిలో హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ)గా విధులు నిర్వహిస్తున్న షాలేము చక్రవర్తిని విధుల నుంచి తొలగించి జిల్లా ఉద్యానవనశాఖాధికారికి సరెండర్ చేసినట్లు ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు సోమవారం తెలిపారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించిన వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులు అన్న కథనానికి స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు వీహెచ్‌ఏను విధుల నుంచి తొలగించి ఆయన స్థానంలో శావల్యాపురం వీఏఏ బ్లెస్సీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి ఎంఏవో రామారావు మాట్లాడుతూ, విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వీహెచ్‌ఏ చక్రవర్తికి గత నెలలో షోకాజ్ నోటీసులు ఇచ్చామని, ఆయన స్పందించక పోవడంతో జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఆదేశాలతో ఆయనకు సరెండర్ చేశామన్నారు. కారుమంచిలో రబీలో రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

డీసీసీబీ చైర్మన్ పదవీ కాలం పొడిగింపు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 26 నుంచి మరో ఆరు నెలల పాటు పదవీ కాలాన్ని పొడిగించింది. ప్రస్తుతం గుంటూరు డీసీసీబీ చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు కొనసాగుతున్నారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

● 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండి స్వాధీనం

మంగళగిరి సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి రూరల్ సీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ నిందితుల వివరాలను వెల్లడించారు. విశాఖపట్నం గాజువాక ఎర్రగడ్డ కాలనీకి చెందిన తోట శివకుమార్ అలియాస్ శివభవానీ, అతని భార్య వరలక్ష్మి, కడప జిల్లా అక్కయ్యపల్లికి చెందిన షేక్ ఇంతియాజ్ కలిసి చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. డిసెంబరు 4వ తేదీన వీరు మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని ఓ ఇంట్లో ఆరు జతల వెండి పట్టీలు, ఒక జత చెవిదిద్దులు, బంగారు మాటీలు, రూ.20 వేల నగదు దొంగిలించి కడపకు వెళ్లారు. ఆ తర్వాత కడప, దువ్వాడ, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఎర్రబాలెం గ్రామంలో జరిగిన చోరీకి సంబంధించి బాధితుడు భూక్యా వీరాంజనేయులు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, ఎస్‌ఐలు చిరుమామిళ్ల వెంకట్, బాలు నాయక్, ఏఎస్‌ఐ రత్నరాజు, కానిస్టేబుల్ సాగర్ పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

ఉత్కంఠభరితంగా సాగిన ఫ్లోర్‌బాల్ పోటీలు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలు ఉత్కంఠంగా సాగాయి. నరసరావుపేట సమీపంలోని కేసనపల్లి వద్ద ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బాలబాలికలకు రాష్ట్రస్థాయి 19వ ఫ్లోర్ బాల్ పోటీలు డిసెంబరు 6,7వ తేదీలలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 15 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలలో బాలుర విభాగంలో కృష్ణా జిల్లా మొదటి స్థానం, తిరుపతి రెండో స్థానం, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నరసరావుపేట మూడో స్థానం సాధించాయి. బాలికల విభాగంలో, తిరుపతి మొదటి స్థానం, అనంతపురం ద్వితీయ స్థానం, పల్నాడు జట్లు తృతీయ స్థానం సాధించాయి. ఈ పోటీల విజేతలకు మెడల్స్ ట్రోఫీలను స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశ్‌రావు, డైరెక్టర్ నాగోతు సబిత అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ పులేకర్, రాష్ట్ర ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజర్ రత్నకుమార్, టోర్నమెంట్ డైరెక్టర్ ప్రసాద్, పల్నాడు జిల్లా సెక్రెటరీ మల్లవరపు కిషోర్ బాబు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పిల్లి సురేంద్ర, పాఠశాలల కోచ్‌లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న స్కూల్ చైర్మన్ నాగోతు ప్రకాశ్‌రావు

ఆరుపళ్ల విభాగంలో విజేత పల్నాడు జిల్లా ఎడ్లు



బండను లాగుతున్న ఎడ్లు

గురజాలటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పట్టణంలో నిర్వహిస్తున్న ఎడ్లబండలాగుడు పోటీల్లో సోమవారం ఆరుపళ్ల విభాగంలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత విజేతగా నిలిచింది. 4,014 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం సాధించింది. బాపట్ల జిల్లా యద్దనపూడికి చెందిన మేస్త్రి ఖాదర్ మస్తాన్, తెలంగాణ రాష్ట్రం మఠంపల్లికి చెందిన గాదె ఆషేక, సుమన్‌రెడ్డిల సంయుక్త ఎడ్లజత 3,886 అడుగులతో రెండోస్థానం, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, మధు ఎడ్లజత 3,871 అడుగులతో మూడోస్థానం, గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లజత 3,776 అడుగులతో నాలుగో స్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లజత 3,750 అడుగులతో ఐదోస్థానం, గుంటూరు జిల్ల కొండేపాడుకు చెందిన చాగంటి శ్రీనివాసచౌదరి ఎడ్లజత 3,539 అడుగులతో ఆరో స్థానంలో నిలిచాయి.

పది పరీక్ష ఫీజు పొడిగింపు

సత్తెనపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు అపరాధ రుసుంతో ఈ నెల 18వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో ఈ నెల 12వ తేదీ వరకు, రూ. 200 అపరాధ రుసుంతో ఈ నెల 15వ తేదీ వరకు, రూ. 500 అపరాధ రుసుంతో ఈ నెల 18వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.

ఏఎన్‌యూ-ఎన్‌టీఆర్ బయోసెన్సర్స్ మధ్య ఎంవోయూ

ఏఎన్‌యూ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం-ఎన్టీఆర్ బయో సెన్సర్స్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, బయోసెన్సర్స్ పరిశ్రమ ప్రతినిధి కె.సురేష్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రెండు సంస్థలు అవగాహన ఒప్పందంలో భాగంగా పరిశోధనలు ప్రోత్సహించడం, మెడికల్ ప్రయోగశాలను వినియోగించడం, పరిశోధన నైపుణ్యాలను ఇచ్చిపుచ్చుకోవడం, వ్యవస్థాపక కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు మెడికల్ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వనున్నాయి. బయో మెడికల్ ఇంజనీరింగ్, వైద్య పరికరాలు, బయో సెన్సర్స్ రంగాల్లో ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు చేపట్టనున్నాయి. ఈ అవగాహన ఒప్పందం మూడేళ్ల కాలంలో విద్యార్థులకు కార్యశాలలు నిర్వహిం చడంతో పాటు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నారు. అలాగే విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ ఇస్తూ పరిశ్రమల మార్గదర్శకత్వ విజ్ఞానంలో తీర్చిదిద్దుతారు.



వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరామప్రసాద్ సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న రిజిస్ట్రార్ సింహాచలం, కంపెని ప్రతినిధి సురేశ్

ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు



విజేతగా నిలిచిన గుంటూరు బాలికల టీం

చుండూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మోదుకూరు శ్రీవేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన బాల బాలికల టీంలు పోటీ పడ్డాయి. సోమవారం జరిగిన బాలికల ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టుపై గుంటూరు 4-2 పాయింట్స్ తేడాతో విజయం సాధించింది. బాలుర ఫైనల్స్‌లో కడపపై విజయనగరం జట్టు 2-1 పాయింట్లతో విజయకేతనం ఎగరవేసింది. విజేతలకు గుంటూరు ఏపెక్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ రిఫరీ అన్నపరెడ్డి జగదీశ్వరరెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు, జిల్లా పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, టోర్నమెంట్ పర్యవేక్షకుల బాలికల విభాగం జయరాజు (తూర్పుగోదావరి), బాలుర టీం పర్యవేక్షకుడు చంద్రశేఖర్ (కడప) హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పద్మాకరరావు, అన్నపరెడ్డి నరసారెడ్డి, చంద్రమోహనరావు, మన్నార్ అమర్‌నాథ్, మన్నవ బద్రీనారాయణ, (ఏపీ టీం కోచ్) గాయం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీసీ అభినందన



వీసీకి బహుమతులను చూపిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

ఏఎన్‌యూ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరీనా- 2025 స్పోర్ట్స్ కాంపిటీషన్స్ నిర్మల ఫార్మసీ కళాశాల, మంగళగిరి వారు నిర్వహించిన క్రీడా పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ఫార్మసీ విద్యార్థులు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ గంగాధర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారు గెలుపొందిన బహుమతులు వీసీకి చూపించారు. ఖోఖో ఉమెన్స్, వంద మీటర్ల రిలే రన్నింగ్‌లో ప్రథమ బహుమతులు, చెస్‌లో ద్వితీయ బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తేజోమూర్తి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్ కిషోర్ పాల్గొన్నారు.

సంక్షేమంపై ఏఐ

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులను, వారికి అందే సేవలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ.. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.

మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దాదాపు వందకు పైగా వసతి గృహాలున్నాయి. ఇందులో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా వేర్వేరు హాస్టల్స్ అందుబాటులో ఉన్నాయి. దాదాపు పదివేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ వసతి పొందుతూ చదువుకుంటున్నారు. అయితే హాస్టల్స్‌లో నిత్యం ఏదో ఒక సమస్య విద్యార్థులని వేధిస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ అమలు చేయకపోవడం, కూరలు, భోజనంలో నాణ్యత లోపించడం, మంచినీటి సరఫరాలో ఇబ్బందులు, మౌలిక వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలు పరిష్కరించడంతోపాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

యాప్‌తో పర్యవేక్షణ ఇలా

సంక్షేమ వసతి గృహాల్లో ఉదయం స్టడీ అవర్స్ నుంచే యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. స్టడీ అవర్స్ నిర్వహణ, మరుగుదొడ్ల పరిస్థితి, విద్యార్థులకు అందించే మెనూ వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులు స్నానాలు చేసి పరిశుభ్రంగా ఉన్నారా లేదా అనే విషయాలు రికార్డు చేయాలి. అంతే కాకుండా రోజూ అల్పాహారం, కూరగాయలు, భోజనం నాణ్యత ఎలా ఉంది, ఎంతమంది విద్యార్థులు భోజనం చేశారు, భోజన సమయంలో మంచినీటి నాణ్యత, హాస్టల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉందా లేదా అనే వివరాలు యాప్ ద్వారా పర్యవేక్షిస్తారు. నిర్దేశించిన వివరాలను నిత్యం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో అప్‌లోడ్ చేసే ఫొటోలు, వీడియోలో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే కృత్రిమ మేధ ద్వారా పనిచేసే యాప్ రాష్ట్రస్థాయి అధికారులను అప్రమత్తం చేస్తుంది. వెంటనే లోపాల గురించి సంక్షిప్త సమాచారం సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు సదరు అధికారుల నుంచి సమాచారం చేరుతుంది. ఫలితంగా లోపాలకు అవకాశం లేకుండా ఉంటుందని వెల్ఫేర్ ఆఫీసర్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 రోజుల క్రితం ఈ యాప్‌ను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇందుకోసం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ఆధార్ నంబరుతో పాటు ప్రత్యేకంగా పాస్‌వర్డ్‌ను అందించారు. దీని లాగిన్ అయిన తర్వాత రోజువారీ సమాచారం యాప్‌లో అప్‌లోడు చేయాల్సి ఉంటుందని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వెల్లడిస్తున్నారు.

టీడీపీ కార్యకర్తకు భరోసా

● మంత్రి లోకేశ్ సూచనకు చీఫ్ విప్ జీవీ స్పందన



జీవీ ఆంజనేయులును కలిసిన టీడీపీ కార్యకర్త రామారావు

వినుకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ టీడీపీ కార్యకర్త పడుతున్న ఆర్థిక కష్టాలను తీర్చాలని మంత్రి నారా లోకేశ్ సూచన మేరకు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు స్పందించారు. టీడీపీ కార్యకర్తకు సాయం చేస్తామని భరోసా కల్పించారు. బొల్లాపల్లి మండలం గరికపాడు టీడీపీ గ్రామ ప్రెసిడెంట్ రామారావు తాను తీవ్ర కష్టాల్లో ఉన్నట్లు మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. రామారావు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చాలని మంత్రి లోకేష్ ట్విట్టర్ వేదికగా చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు సూచించారు. వెంటనే స్పందించిన జీవీ గరికపాడు టీడీపీ కార్యకర్త రామారావును కలిసి ఆయనకున్న సమస్యలను, కష్టాలను విన్నారు. పిల్లల చదువు నిమిత్తం వ్యక్తిగతంగా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం ద్వారా సొంత ఇల్లు కట్టిస్తానని ఆయనకు భరోసానిచ్చారు. వినుకొండ నియోజకవర్గంలో ఏ టీడీపీ కార్యకర్తకు సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

సత్తెనపల్లిలో విజిలెన్స్ దాడులు

● రూ.10 లక్షల విలువైన అనధికార బయోత్పత్తులు సీజ్

సత్తెనపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం గుంటూరు విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నైనిక రాజు ఎరువుల దుకాణంలో రికార్డులు సరిగా నిర్వహించక పోవటంతో రూ.9.47 లక్షల విలువైన ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేసి ఉన్నతాధికారులకు తదుపరి చర్యల నిమిత్తం నివేదిక పంపుతున్నట్లు ఏడీఏ రవి బాబు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర రైతు సేవా కేంద్రంలో అనధికారికంగా నిర్వహించిన రూ.10 లక్షల విలువైన బయోత్పత్తులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, సీహెచ్ ఆదినారాయణ, ఏవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉండగా ఆర్టీసీ డ్రైవర్‌కు అనారోగ్యం



వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యల్లయ్య

వినుకొండటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉండగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ తీవ్ర జ్వరంతో స్పృహ తప్పి పడిపోయారు. గమనించిన సిబ్బంది హుటాహుటిన ఆయన్ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన సోమవారం వినుకొండ గ్యారేజీలో జరిగింది. వినుకొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న పాలపర్తి యల్లయ్య సోమవారం విజయవాడ ట్రిప్‌కు వెళ్లేందుకు గ్యారేజీ నుంచి బస్సును తీసుకొస్తూ అక్కడే డివైడర్‌ను ఢీకొట్టి స్పృహ తప్పి పడిపోయారు. గమనించిన గ్యారేజీ సిబ్బంది హుటాహుటిన ఆయన్ను చికిత్స నిమిత్తం వినుకొండ ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. డ్రైవర్ యల్లయ్య తీవ్రజర్వంతో అనారోగ్యానికి గురైనట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు ఎటువంటి ప్రమాదం లేదని చెప్పడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.

బుద్ధవనం ఆకట్టుకుంది

● దక్షిణాసియా దేశాల రాయబారులు

విజయపురిసౌత్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నాగార్జున సాగర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనం వారసత్వ థీమ్ పార్క్ తమను ఎంతో ఆకట్టుకుందని దక్షిణాసియా దేశాల రాయబారులు అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ప్రతినిధులు సోమవారం బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య బౌద్ధ శాలువలు, పుష్పగుచ్ఛాలతో వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం బుద్ధవనంలోని వివిధ విభాగాలను సందర్శించిన రాయబారులు ఇంత పెద్ద మహాస్థూపాన్ని, దాని చుట్టూ ఉన్న వేలాది శిల్పాలను, స్థూపాల నమూనాలను, బుద్ధుని శిల్పాన్ని, జాతక కథ శిల్పాలను ఒక్కచోట చూడడం గొప్ప విషయమన్నారు.



బుద్ధవనం వద్ద దక్షిణ ఆసియా దేశాల రాయబారులు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 577.40 అడుగులు ఉంది. ఇది 275.51 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 21,714 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 41,881 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 41,881 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 43.54 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి తొమ్మిది వందల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరతోందని, ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

37,706 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 40,522 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,706 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,325 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15500
273	----	----
341	10500	16500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15600
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16700
దేవనూరు డీలక్స్	11000	16300
ఆర్మూరు	10500	13000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16800
నెంబరు. 5	11000	15300
273	----	----
341	12000	16500
4884	12000	14200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	11000	17000
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7600

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

మాచర్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంటకోత ప్రయోగాలపై ఏఎస్‌వో ప్రభాకర్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలతో దిగుబడి అంచనా వేయొచ్చన్నారు. పంట నష్టపరిహారం కూడా లెక్కించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో పాపకుమారి, డీవైఎస్‌వో అయుబ్, వ్యవసాయ విస్తరణాధికారి చౌదరిరెడ్డి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

మేదరమెట్ట పేరును కొనసాగించాలి..

మాచర్ల రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతిలోని మేదరమెట్ట ప్రాంతానికి ఆ పేరును యథాతథంగా కొనసాగించాలని మేదర సంఘీయులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో వాయవ్య దిశలో మేదరమెట్ట ఉందని, గతంలో మేదర సంఘీయులు ఆ ప్రాంతంలో గంపలు, బుట్టలను అల్లేవారని, అందుకే ఆ ప్రాంతానికి మేదరమెట్ట పేరు వచ్చిందన్నారు. కార్యక్రమంలో మేదరమెట్ట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదేపల్లి ఉమా మహేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కొండా ఉమామహేశ్వరరావు, తమ్మినేని శ్రీనివాసరావు, పాతకోట వెంకటేశ్వర్లు, తమ్మినేని రమణయ్య, శ్రీనివాస్, గుండా రవికుమార్, జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

51 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

విజయపురిసౌత్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి చెందిన డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన సోమవారం విజయపురిసౌత్‌లో ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 51 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరుగురికి శుక్లాలు, నలుగురికి పొరలు, ఎనిమిది మందికి రెటీనా సమస్యలను గుర్తించారు. కార్యక్రమంలో ఆసుపత్రి కౌన్సిలర్ కోటేశ్వరరావు, అష్రమ్ శ్రీను, కోఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవి ఫార్మసీ కళాశాల విద్యార్థిని నవ్యశ్రీ ప్రతిభ

గురజాలటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల విద్యార్థిని కె నవ్యశ్రీ ఆదివారం కర్నూల్‌లో షిటోక్రై అసోసియేషన్ నిర్వహించిన 5వ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో మొదటి బహుమతిని సాధించింది. ఈ మేరకు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఉల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్ కిషోర్‌బాబులు అభినందించారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అనంతరామయ్య ఎన్నికపై హర్షం

దుర్గి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా స్థానిక జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు జీసీహెచ్ అనంతరామయ్య ఎన్నిక పట్ల దుర్గి మండల ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు వి మంగళనాయక్, యర్రం ఏడుకొండలు, గౌరవాధ్యక్షుడు షేక్ నబీసాహెబ్, ఆర్థిక కార్యదర్శి అంకిపల్లి బంగారయ్యలు సోమవారం హర్షం వ్యక్తం చేశారు.

ఎస్టీయూ జిల్లా కార్యదర్శిగా పరమేశ్వరరెడ్డి

నకరికల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ జిల్లా కార్యదర్శిగా ఎండ్లకుంట ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు మేడికొండ పరమేశ్వరరెడ్డిని ఎంపిక చేసినట్టు ఎస్టీయూ నకరికల్లు మండల అధ్యక్షుడు సీహెచ్‌వీ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు.

అచ్చంపేట సచివాలయాల మండల అధికారిగా శ్రీనివాసరావు

అచ్చంపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండల సచివాలయాల అధికారిగా కీనిడి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో 17 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాలకు ప్రత్యేక అధికారిగా ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

సీపీఎస్ జిల్లా విభాగం కన్వీనర్‌గా విజయ ప్రసాదు

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ పల్నాడు జిల్లా సీపీఎస్ విభాగం కన్వీనర్‌గా మండలంలోని కంకణాలపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జల్లి విజయ ప్రసాదు ఎన్నికయ్యారు. ఈనెల 7వ తేదీ నరసరావుపేటలో జరిగిన ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఈ నియామకం జరిగినట్టు విజయ ప్రసాదు తెలిపారు.

పల్నాడు జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే

మాచర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరిశెట్టి కళ్యాణ మండపంలో సోమవారం పట్టణంలోని పల్నాడు జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి, చైర్మన్ మారేపల్లి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ శివభాస్కర్, మర్రి వెంకట నారాయణ, డైరెక్టర్ మస్తాన్‌వలి, ఆంజనేయశాస్త్రి బహుమతులను అందించారు.

రబీ పంటలపై రైతులకు అవగాహన

పెదకూరపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రబీ పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని లగడపాడులో సోమవారం రబీపంటలపై సోమవారం ఆత్మా సౌజన్యంతో రైతులకు రసాయన కలుపు, మందుల వినియోగం, పలు విషయాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

సత్తెనపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. బాలి సైదా అనే విద్యార్థి రోషన్ పై దాడి చేయటంతో ముక్కు, తలకు గాయాలై రోషన్ సొమ్మసిల్లి పడి పోయాడు. సమాచారం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు రోషన్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటన పై పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

వెల్దుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగిరిపాడు ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో సోమవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ఎండీ ఖాసీం ముఖ్య అతిథిగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పి ఉపాధ్యాయులు అరుణ, భూలక్ష్మి, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, డాక్టర్ అనిల్‌కుమార్, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఈవోల నిరసన

పిడుగురాళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక జేఏసీ పిలుపు మేరకు సోమవారం పిడుగురాళ్ల బ్రాంచి పరిధిలో సీఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జానపాడు రోడ్డులోని సొసైటీ బ్యాంక్ ఎదుట సీఈవోలు వెంకటేశ్వర్లు, గోపి, అంకారావు, అరుణ, వీరారెడ్డి తదితరులు నిరసన వ్యక్తం చేసి బ్యాంక్ అధికారులకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సహకార బ్యాంక్ సీఈవోలు

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి

● కూటమి నాయకులతో ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 12వ వార్డు టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి వార్డును అభివృద్ధి పథంలో నడిపించేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు ధృవీకరణ పత్రాలను వెంటనే మంజూరు చేసి పారదర్శకతతో పని చేయాలన్నారు. వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. చౌటా శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, సరికొండ వెంకటేశ్వరరాజు, మస్తాన్‌వలి, జాన్‌బాబు, చుక్కపల్లి శ్రీను, పలువురు కూటమి నేతలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయం

సత్తెనపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సత్తెనపల్లి శాఖ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సత్తెనపల్లి శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులు ప్రజలకు సేవలు మరింత ఎక్కువగా చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పేద మహిళలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఆలా చంద్రశేఖర్, పీ రామకోటేశ్వరరావు, రోశయ్య, సాంబశివరావు, దరువూరి నాగేశ్వరరావు, ఎం శేషగిరిరావు, గుప్తా, రెడ్‌క్రాస్ సొసైటీసభ్యులు, కూటమినేతలు పాల్గొన్నారు.



మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

మాచర్ల చరిత్రలో జూలకంటిదే అత్యధిక మెజార్టీ

● టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి

రెంటచింతల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గం ఏర్పడిన తరువాత జూలకంటి బ్రహ్మానందరెడ్డికి వచ్చినంత మెజార్టీ (33318) ఇతరులెవరికీ రాలేదు.. చిన్నపాటి మనస్పర్థలతో పార్టీకి నష్టం చేయొద్దు.. చాలా ఇబ్బందికర పరిస్థితుల నుంచి వచ్చి ప్రశాంతంగా బతుకుతున్నాం.. అని ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు మెంబరు జంగా కృష్ణమూర్తి అన్నారు. రెంటచింతల ఉప్పస్తంభాల సెంటర్‌లో 227 బూత్ మెంబర్ల కన్వీనర్, పార్టీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీ మెజార్టీని రెంటచింతలలో పూర్తిగా తగ్గించడంలో తీవ్రంగా కృషి చేసిన కన్వీనర్లను అభినందించారు. సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని కోరారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, వై.అప్పయ్య, వరప్రసాద్, సుమంత్‌రెడ్డి, శౌరిరెడ్డి, రామకృష్ణ, రాజ్‌కుమార్, బాలయ్య, సైదులు యాదవ్, మల్లయ్య, ఆర్యవైశ్య నేతలు నాళం పెదబాబు, గుండా రామ్మూర్తి, నరసింహారావు, గోపాలరావు, పోట్ల సైదారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలకు నిధులు మంజూరు

● మూడు మున్సిపాల్టీలకు రూ.117.67 కోట్లు

పిడుగురాళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాలకు అమృత 2.0 పథకానికి నిధులు మంజూరయ్యాయి. పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి మున్సిపాల్టీలకు తాగునీటి చెరువులు, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లు, పైపులైన్లు, కుళాయి కనెక్షన్లకు సంబంధించి రూ.117.67కోట్లు మంజూరయ్యాయి. వీటికి ప్రస్తుతం టెండర్ల దశ మొదలైంది. ఈ నిధులతో పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి పట్టణాలలోని చెరువుల అభివృద్ధి, భూగర్భజలాల పెంపునకు తీసుకోవాల్సిన ప్రణాళికలో భాగంగా చెరువు పూడికతీతలు, కట్టలు బలపరచడం, వీధి కుళాయిల ఏర్పాటు కానున్నాయి. దాచేపల్లి పట్టణానికి 49.62 కోట్లు, పిడుగురాళ్లకు 36.26 కోట్లు, గురజాలకు రూ.18.62 కోట్ల నిధులతో తాగునీటి పథకం పనులు పూర్తయ్యేందుకు లైన్ క్లియర్ అయింది. దీంతో గత వైసీపీ హయాంలో నిర్మాణం మధ్యలోనే నిలిచిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు, వీధి కుళాయిల ఏర్పాటు కానున్నాయి. నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తయి జనవరిలో పనులు ప్రారంభించి వేసవికాలానికి కొంత భాగానికైనా నీటిని అందించే ఉద్దేశంతో పనులు వేగవంతం చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా వున్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రతిపాదనలతో మూడు పట్టణాలకు తాగునీటి పథకాలకు నిధులు మంజూరయ్యాయి.



మార్కెట్‌యార్డులో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు

మంచు దుప్పటి

● మంచు కప్పేయడంతో కానరాని రహదారి
● వాహనదారుల ఇక్కట్లు



దాచేపల్లిలో పొంగ మంచు దృశ్యాలు



దాచేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పొగమంచుతో దాచేపల్లి వాసులు ఇబ్బంది పడ్డారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి మొదలైన పొగమంచు 8వరకు ఉంది. పసిపిల్లలు, చిన్నారులు, పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు, మహిళలు పొగమంచుతో అవస్థల పాలయ్యారు. వాహనాలు కూడా వేగాన్ని తగ్గించి లైట్లు వేసుకొని ప్రయాణాలను కొనసాగించారు. నాగులేరు బ్రిడ్జి, పాత బస్టాండ్ సెంటర్‌లు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూడా దట్టమైన పొగమంచుతో నిర్మానుష్యంగా మారాయి.

● పిడుగురాళ్ళ: మంచు దట్టంగా పడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం తెల్లవారుజాము నుండి ఉదయం 8 గంటల వరకు పట్టణంలోని ప్రధానరహదారి మంచుతో కప్పేసింది. దీం తో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణం చేయాల్సి వచ్చింది.

క్రీడలతో ఆరోగ్యకరమైన పోటీతత్వం

● విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌నాయుడు



ఉత్కంఠభరితంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

రెంటచింతల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవడుతుందని విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ నాయుడు అన్నారు. సోమవారం రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన్ బాల మహోత్సవంలో భాగంగా మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు చెందిన బాల బాలికల క్రీడా పోటీల్లో ప్రారంభోపన్యాసం చేశారు. కార్యక్రమానికి పీడీ డాక్టర్ సురేష్ అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ రమేష్ ప్రసంగిస్తూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. తొలిరోజు పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో 70 పాఠశాలలకు చెందిన 1550 మంది క్రీడాకారులు పాల్గొనగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, పరుగుపందేలను నిర్వహించారు. మంగళవారం ఫైనల్ పోటీలుంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో 2 శివనాగేశ్వరరావు, హెచ్‌ఎం దుర్గా ప్రసాద్,రాఘవేంద్ర, ఎం.నవ్య, కె.మోహన్, మర్రెడ్డి, రాంబాబు, సురేష్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



పెదమద్దూరులో ఓ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పూలింగ్ గ్రామాలలో సీఆర్డీఏ కార్యాలయాలు

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రెండవ దఫా భూసమీకరణ చేయనున్న వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాలలో సీఆర్డీఏ కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను అధికారులు పరిశీలించారు. సోమవారం సాయంత్రం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ చెన్నకేశవులు, సత్తెనపల్లి ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి, తహసీల్దార్ డానియేలు తమ సిబ్బందితో గ్రామాలలో పర్యటించి కార్యాలయాలకు అనువైన భవనాలను పరిశీలించారు.



రాష్ట్ర భట్రాజ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమితులైన సరికొండ వెంకటేశ్వరరాజు సోమవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

- సత్తెనపల్లి

పీఎంశ్రీ పథకానికి క్రోసూరు మోడల్ స్కూల్ ఎంపిక

● ప్రారంభ కార్యక్రమంగా హస్తకళా ప్రదర్శన

క్రోసూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకానికి క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్ ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ మేరీ సూజన్ సోమవారం తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి సూచనగా పాఠశాలలో సోమవారం హస్తకళా ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ వస్తువులు, డిజైన్‌లు, గీసిన చిత్రాలు మొదలైనవి ప్రదర్శనలో ఉంచారు. ఎంఈవో జీ కృష్ణ, ఎంపీడీవో రవికుమార్, పలు శాఖల అధికారులు ప్రదర్శనను తిలకించారు. పాఠశాల అభివృద్ధికి కావాల్సిన సౌకర్యాలను నివేదిక రూపంలో అధికారులకు పంపనున్నట్టు ఆమె తెలిపారు.

భవిష్యత్‌లో డాక్టర్ చినరాజు ఉన్నత స్థానాలకు ఎదగాలి

● ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో డాక్టర్ చినరాజు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఏపీ చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు స్టేట్ డైరెక్టర్ డాక్టర్ గుడిపూడి చినరాజు జన్మదినాన్ని స్థానిక పంచాయతీ రాజ్ అతిథి గృహంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను డాక్టర్ చినరాజుతో కలసి ఎమ్మెల్యే ప్రవీణ్ కట్ చేయించి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ టీడీపీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం సముచిత స్థానాన్ని కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, అర్తిమళ్ళ రమేష్, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, టీడీపీ మండల నాయకులు బాష్యం ఆంజనేయులు, మద్దినేని వెంకటసత్యనారాయణ, బెల్లంకొండ రాంబాబు, షేక్ ముంతాజ్, కావూరి సుజాత, గల్లా శివనాగరాజు, నాదెండ్ల కల్పన, పమిడాల వెంకటరావు, చెన్నుపాటి బుల్లిబాబు, షేక్ మిలటరీ మౌలాలి, భావన రాంబాబు, గుండపనేని బాష, అర్తిమళ్ళ శేషయ్య, గోగులపాటి శ్రీనివాసరావు, ఏటుకూరి శివయ్య తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ చినరాజు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

ఏఎంసీ చైర్మన్‌ల జిల్లా మీటింగ్‌లో పాల్గొన్న శోభారాణి

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ చైర్మన్‌ల జిల్లా సమావేశం గుంటూరులోని మార్కెట్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పల్నాడు జిల్లాలోని ఏఎంసీల చైర్మన్‌లు పాల్గొనగా సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ కోమటినేని శోభారాణి, శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను శోభారాణి విలేకరులకు తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌ల విధులు, బాధ్యతలు, మార్కెట్ కమిటీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, రైతాంగానికి అందించాల్సిన మెరుగైన సేవలపై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత అవగాహన కల్పించినట్టు శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ సునీతను పల్నాడు జిల్లాలోని ఏఎంసీ చైర్మన్‌లు ఘనంగా సన్మానించారు.



మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీతను సన్మానించిన జిల్లాలోని ఏఎంసీ చైర్మన్‌లలో శోభారాణి

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల వద్దకు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు మండలంలోని లగడపాడులో సోమవారం వంద రోజులు వంద గ్రామాల కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు గ్రామాల సమస్యలపై దృష్టి సారించి గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకొని అవకాశం ఉన్నంతవరకు ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రజలు తమ వంతు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, 75 తాళ్ళూరు సహకార సంఘం చైర్‌పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, వట్టికూటి శివరామకృష్ణయ్య, తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఎంపీడీవో సాయిలీల, ఏవో కృష్ణయ్య, డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగు యువత నియోజకవర్గ నాయకులు మక్కెన సాగర్, బాష్యం ఆంజనేయులు, ఏటుకూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని టీడీపీకి చెందిన పలువురి గృహాలకు వెళ్ళి ఎమ్మెల్యే పరామర్శించారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

మురుగు కాలువల్లో పూడిక తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

క్రోసూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రోసూరు గ్రామ పంచాయతీ శివారు ఎర్రబాలెం సమస్యల పరిష్కారంపై అధికారులు స్పందించారు. ఎర్రబాలెం సమస్యల మయం అన్న శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన కదిలారు. పొక్లైనర్‌తో గ్రామంలోని మురుగుకాలువల్లో పూడిక తీయించారు. మరికొన్ని కాలువల్లో పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించారు. అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులను పొక్లైనర్ సాయంతో చదును చేయించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను కూడా వెంటనే తొలగిస్తున్నట్టు తెలిపారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామన్నారు. శ్మశానవాటికల అభివృద్ధికి, ఇతర సమస్యల పరిష్కారానికి నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు.



అంతర్గత రహదారిని చదును చేయిస్తున్న అధికారులు

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

రెంటచింతల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో డిజిటల్ మోసాలు పెరిగాయని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.హనుమంతు కోరారు. సోమవారం బ్యాంక్‌లో డిజిటల్ మోసాలపై జాగ్రత్తల గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌పే ద్వారా డబ్బు వేయడం, తీసుకోవడం వంటివి చేయరాదన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఖాతా నుంచి డబ్బుపోతే వెంటనే సైబర్ క్రైమ్‌కు ఫోన్ చేయాలని సూచించారు. డిజిటల్ అరెస్టులు అనేవి బూటకమని ప్రజలు అటువంటివి నమ్మవద్దన్నారు. సుమారు 54 రకాల సేవలను యూనియన్ బ్యాంక్ నుంచి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎం.రామప్రసాద్, మస్తాన్, ఖాతాదారులు పాల్గొన్నారు.

సర్వే వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి


మాచర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావేదికకు వస్తున్న అర్జీల్లో ప్రధానంగా భూ సమస్యలే అధికంగా ఉన్నాయని, సర్వే వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వే వ్యవస్థ ప్రక్షాళన కాకుంటే పెట్టుబడులు, ఉద్యోగాలు ఉండవని, పారిశ్రామిక వేత్తలు రారని, అన్ని కాగితాలకే పరిమితమవుతాయన్నారు. మండలంలోని ఏకోనాంపేటలో భారీగా జరుగుతున్న భూలావాదేవీలపై విచారణ చేయాలన్నారు. ఈ సమావేశంలో దొడ్డా శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, రమేష్, నాజర్‌వలి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

దుర్గి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని ఏపీఎంఎస్ పాఠశాలలో భూసార పరీక్షలు, ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఎఫ్ పథకం, పీఎంఆర్‌వీకేవై ప్రోగ్రాంలో భాగంగా మట్టి ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం లేకుండా పంటలు సాగు చేయడం ద్వారా మానవ ఆరోగ్యం, పర్యావరణం, పంటలకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలస్వామి, ఎన్‌వీ శివయ్య, మల్లెల నరసయ్య, యాకోబు, అరుణ, అమీర్‌రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ

మాచవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాచవరం శివారులోని పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి రాగివైరు చోరీచేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. బాధితుడు కాటా రామారావు కథనం మేరకు తన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైరును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని తెలిపారు. మాచవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టిన దృశ్యం

ఘనంగా మహానటి సావిత్రి జయంతి

క్రోసూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహానటి సావిత్రి 90వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం క్రోసూరులోని పిడుగురాళ్ళ బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల సేవా సమితి ఆధ్వర్యంలో సావిత్రి చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. కళా సమితి అధ్యక్షులు శిఖా శ్యామ్‌సన్ మాట్లాడుతూ మహానటి సావిత్రి జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో కళాసమితి నాయకులు షేక్ మస్తాన్, పోతుగంటి నాగేశ్వరరావు, బండారు మైసూర్ బాబు, పోతుగంటి లక్ష్మయ్య, జానీ బాషా, షేక్ జమ్ముల, సింగర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సెక్రటేరియట్ టవర్స్ పనులు



ఎమ్మెల్యే ఎమ్మెల్సీ టవర్లు



ఏఐఎస్ టవర్స్



గ్రూపు-డీ టవర్స్



అమరావతి జిగేల్ జిగేల్



ఏఐఎస్ బంగ్లాలు



హ్యాపీ నెస్టు ప్రాజెక్టు



ఎన్జీవో టవర్స్

● అబ్బురపరుస్తున్న రాజధాని నైట్ వ్యూ

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో గాఢాంధకారంలో ఉన్న రాజధాని అమరావతి నేడు విద్యుత్ దీపాల వెలుగులతో జిగేల్ జిగేలున వెలిగిపోతోంది. నగరంలో రాత్రి వేళ దృశ్యాలు (నైట్ వ్యూ) చూపరులను అబ్బురపరుస్తున్నాయి. ఏపీసీఆర్డీఏ డ్రోన్ ద్వారా రాజధానిలో జరుగుతోన్న నిర్మాణ పనులు, ఇప్పటికే పూర్తయిన భవనాలు ఏ విధంగా ఉన్నాయో చిత్రీకరించారు. అలానే రాత్రి వేళ జరుగుతోన్న పనులను కూడా డ్రోన్ కెమెరాల ద్వారా ఏరియల్ షూట్ చేశారు. ఏఐఎస్ బంగ్లాలు, ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ టవర్లు, గ్రూపు-డీ టవర్లు, ఎన్జీవో టవర్లు, హ్యాపీ నెస్టు ప్రాజెక్టు, ఏఐఎస్ టవర్లు, కోర్ క్యాపిటల్ ఏరియా, సెక్రెటేరియట్ టవర్స్ చిత్రాలను ఆదివారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయగా నిమిషాల వ్యవధిలోనే వందల సంఖ్యలో వ్యూస్, లైకులు వచ్చాయి. దేశ, విదేశాల్లో ఉన్న ఈ ప్రాంత ప్రజలు వేగవంతంగా జరుగుతోన్న అభివృద్ధిని చూసి మురిసిపోతూ ఆ చిత్రాలను వారి సామాజిక మాధ్యమాల ఖాతాల నుంచి షేర్ చేస్తున్నారు.

అమ్మ ఫోను

● గర్భిణులు ఫోన్ వాడితే పిల్లలకు బ్రెయిన్ ట్యూమర్..!

పిల్లలకు చేటు

● గుంటూరులో వెలుగు చూసిన రెండు కేసులు

● అరుదైన శస్త్రచికిత్సతో ట్యూమర్ల తొలగింపు

● కిమ్స్ న్యూరో సర్జరీ వైద్యనిపుణుల ఘనత

గుంటూరు మెడికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు చిన్నారులు సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్ ఎక్కువగా వాడితే వారిలో తెలివితేటలు తగ్గుతాయని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా గుంటూరులోని ప్రముఖ వైద్యశాలలో పుట్టుకతోనే ఇద్దరు పసికూనలు బ్రెయిన్ ట్యూమర్‌కు గురైన విషయం తెలిసి వైద్య వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. బహుశా గర్భిణీలు మొబైల్ ఫోన్ వాడటం, ల్యాప్‌ట్యాప్ చూడటం లేదా రేడియే షన్‌కు గురికావడం వల్ల పుట్టిన శిశువులకు బ్రెయిన్ ట్యూమర్ సోకి ఉంటుందని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు నగరంలోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌కు ఇటీవల పది రోజుల వయస్సు ఉన్న ఇద్దరు పసి కందు లను తీసుకొచ్చారు. ఇద్దరు అరుదైన బ్రెయిన్ ట్యూమర్‌కు గురైనట్లు వైద్య వర్గాలు గుర్తించాయి. అయితే ఈ కేసులను సవాల్‌గా తీసుకున్న కిమ్స్ వైద్యులు ఆపరేషన్ చేసి విజయవంతంగా మెదడులో ఏర్పడ్డ కణితులను తొలగించారు. కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, కిమ్స్ కడిల్స్‌కు చెందిన డాక్టర్ సాహితి చందర్లపాటి, డాక్టర్ పవన్ సత్యం, డాక్టర్ బాలకృష్ణారెడ్డి పల్నాటి, డాక్టర్ రూపేష్, డాక్టర్ ప్రత్యూష వైద్య బృందం ఈ శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఎనస్థటిస్ట్ డాక్టర్ కల్యాణ్‌రామ్ నేతృత్వంలోని వైద్యనిపుణుల బృందం అడ్వాన్స్ టెక్నిక్‌తో ఆధునిక వైద్యపద్ధతులతో మత్తు సేవలు అందించారు. మూడు గంటల పాటు శ్రమించిన సర్జన్ల బృందం చిన్నారుల్లో బ్రెయిన్ ట్యూమర్‌ను తొలగించారు. ఆపరేషన్ తర్వాత పిల్లలు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ప్రపంచంలో 300 కేసులు మాత్రమే...

ఈ సందర్భంగా చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, కోటి మంది పిల్లల్లో ఒకరికి మాత్రమే పుట్టుకతో బ్రెయిన్ ట్యూమర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. తల్లి గర్భంలోనే పిల్లలకు బ్రెయిన్ ట్యూమర్ రావడం అత్యంత అరుదని ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి కేసులు ఇప్పటి వరకు కేవలం 300 మాత్రమే నమోదైనట్లు ఆయన వెల్లడించారు. బహుశా గర్భిణీలు మొబైల్ ఫోన్ వాడటం వల్ల, రేడియేషన్‌కు గురికావడం వల్ల పుట్టిన శిశువులకు బ్రెయిన్ ట్యూమర్ సోకి ఉంటుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పరిశోధనలు జరగాల్సి ఉందని ఆయన తెలిపారు.



ఇద్దరు శిశువులతో కిమ్స్ న్యూరో సర్జరీ వైద్య బృందం

రూపాయి ప్లాన్ పనిచేసింది



● నయా ఆఫర్లతో ఆకట్టుకుంటున్న బీఎస్ఎన్ఎల్

● రూపాయి ప్లాన్‌తో ప్రజల చెంతకు

● ఆఫర్ నెలాఖరు వరకు పొడిగింపు..

● రోజు రోజుకు పెరుగుతున్న యూజర్లు

● వినియోగానికి తగ్గట్టుగా టవర్ల ఏర్పాటు



గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల ఆదరణ పొందుతోంది. జియో, ఎయిర్‌టెల్, వొడా వంటి ప్రైవేటు నెట్‌వర్క్‌లను తట్టుకుని మార్కెట్‌లో మరింత విస్తరిస్తోంది. ఒకానొక దశలో ప్రైవేటు కంపెనీల ధాటికి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్.. చతికిల పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మెరుగైన 4జీ సేవలు అందిస్తూ.. తక్కువ ధరలతో వినియోగదారులను ఆకర్షిస్తోంది. ప్రైవేట్ కంపెనీలు కాల్ చార్జీలను అధిక మొత్తంలో పెంచడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో గుంటూరు బీఎస్ఎన్ఎల్ పరిధిలో (ప్రకాశం, గుంటూరు) వినియోగదారుల సంఖ్య 1.25 లక్షలు దాటింది. దీనిని దృష్టిలో పెట్టుకుని బీఎస్ఎన్ఎల్ తమ నెట్‌వర్క్‌ను కూడా పెంచుతుంది. అందులో భాగంగానే ఈ పరిధిలో 113 కొత్త 4జీ నెట్‌వర్క్ టవర్లను కూడా ప్రారంభించింది. దీంతో బీఎస్ఎన్ఎల్ టవర్ల సంఖ్య 732కు చేరింది.

● ఆకట్టుకుంటున్న రూపాయి ప్లాన్

బీఎస్ఎన్ఎల్ ఫోన్ వినియోగ దారులకు 75వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఫ్రీడమ్ ప్లాన్‌తో మళ్లీ ప్రజల ముందుకు వచ్చింది. ఒక్క రూపాయికి సిమ్‌తో పాటు 30 రోజుల వ్యాలిడితో అపరిమిత కాలింగ్, రోజుకు 2 జీబీ డేటాతో అందుబాటులోకి వచ్చింది. అయితే ఈ అవకాశం కేవలం కొత్త కస్టమర్లతో పాటు ఎంఎన్‌పీ వినియోగదారులకు కల్పించారు. ఆగస్టు 15న ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకురాగా ఆగస్టు 31తో ఈ ప్లాన్ ముగిసి పోయింది. వినియోగదారుల నుంచి వస్తున్న స్పందన నేపథ్యంలో రెండోసారి ఈ ప్లాన్‌ను అందుబాటులోనికి తీసుకురావడంతో పాటు డిసెంబరు 31 వరకు కొనసాగిస్తున్నారు.

● వినియోదారుల అభిరుచికి తగ్గట్టుగా ప్లాన్స్

4జీ నెట్‌వర్క్‌తో వినియోగదారుల అభిరుచికి తగ్గట్లుగా బీఎస్ఎన్ఎల్ ఎన్నో రకాల ప్లాన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇతర ప్రైవేట్ నెట్‌వర్క్‌లతో పోలిస్తే తక్కువ రేటుకు ఈ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. తక్కువ డేటాను వినియోగించే వారితో పాటు ఎక్కువ డేటాను వినియోగించే వారి కోసం ప్లాన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇతర నెట్‌వర్క్‌లతో పోలిస్తే వ్యాలిడితో పాటు, డేటా ఎక్కువ రావడం, రీచార్జ్ ప్లాన్ మొత్తం కూడా తక్కువగా ఉండటంతో వినియోగదారులు ఆకర్షితులవుతున్నారు. రూ.2,399 రీచార్జ్‌తో రోజుకు 2 జీబీ డేటా.. 365 రోజులు వ్యాలిడిటీ, రూ.1999 రీచార్జితో 1.5జీబీ డేటా 330 రోజుల వ్యాలిడిటీ, రూ.1499 రీచార్జితో 32 జీబీతో పాటు 300 రోజుల వ్యాలిడిటీ.. ఈ విధంగా రూ.997, రూ.599,రూ.485,రూ.347,రూ.225, రూ.199 వంటి ప్లాన్‌లతో పాటు మరెన్నో ప్లాన్‌లు అందరికి అందుబాటులో ఉన్నాయి.

● మెరుగైన సేవలు

-సప్పరపు శ్రీధర్, ఏరియా జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్



వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నాం. వినియోగదారుల్లో విశ్వసనీయత పెంచే విధంగా ప్రయత్నిస్తున్నాం. అందులో బాగంగానే 4జీ టవర్లను కూడా పెంచడం జరిగింది.

ఖాకీ కుమారుడే కారకుడు!

(5వ పేజీ తరువాయి)

పరిశీలించారు. సంబంధిత కారు నంబరును గుర్తించి.. అది తమ శాఖకు సంబంధించింది కాదని నిర్ధారణకు వచ్చారు. తమ అధికారులు తనిఖీలు చేయలేదని రవాణశాఖ జిల్లా అధికారి వెల్లడించడంతో.. పోలీసు శాఖ ప్రమాద ఘటనపై ప్రత్యేక దృష్టి సారించింది. తీగ లాగితే.. డొంక కదలినట్లు.. ముఠా అక్రమాల గుట్టు వెలుగు చూసింది. పోలీసు విచారణలో కంగుతినే అంశాలు వెలుగుచూశాయి.

ఒక్కసైగతో ఐదుగురు దుర్మరణం..

చిలకలూరిపేట బైపాస్‌లో ఇటీవల ట్రాలీ ఢీ కొట్టి ఐదుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటన ఐదుగురి యువకుల ముఠా కారణంగానే జరిగిందని తేలింది. ఈ గ్యాంగ్ దొంగ నంబరు ప్లేటు కారులో వచ్చి.. రవాణా శాఖ అధికారులుగా నటించి సైగ చేస్తూ లారీని అకస్మాత్తుగా ఆపారు. లారీని రోడ్డు పక్కకు తీస్తున్న క్రమంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల కారు కంటెయినర్‌ను ఢీకొంది. దీంతో వారు దుర్మరణం చెందారు. ప్రమాదం ఘటన హైవే సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కంటైనర్ లారీని ఆపిన వారి గురించి ఆరా తీసిన క్రమంలో దొంగ నంబరు ప్లేటుతో రవాణా శాఖ అధికారులుగా దందాలు చేస్తున్న యువకుల ముఠా వివరాలు పోలీసులకు తెలిశాయి.

తండ్రి అండతో నేరాలు..

ఈ గ్యాంగ్ లీడర్ పోలీసు అధికారి కొడుకు కావడంతో తన నేర సామ్రాజాన్ని కొనసాగించారు. ఈ ముఠా కార్లు కూడా దొంగలించి విక్రయించినట్లు పోలీసు దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. గతంలో బంగారం విక్రయిస్తామని కొందరి వద్ద రూ.40 లక్షలు కాజేశారు. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేసినా విచారణ జరపకుండా అప్పటి పోలీసు అధికారులు నేరస్తులకు సహకరించినట్లు ఆరోపణ ఉంది. తండ్రి పోలీస్ అధికారి కావడంతో బంగారం కేసు నుంచి తప్పించినట్లు ప్రచారం. అలాగే కార్లు కాజేసిన కేసుల్లో కూడా తండ్రిని అడ్డుపెట్టుకొని సులువుగా తప్పించుకున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. తండ్రితో పాటు, అధికార పార్టీ అండదండలు కూడా ఈ గ్యాంగ్‌కు ఉన్నట్లు తెలుస్తోంది. నకరికల్లు మండలం నరశింగపాడుకు చెందిన ఓ యువకుడు కూడా ఈ నేరాల్లో భాగస్వామిగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఇద్దరితో పాటు మొత్తం ఐదుగురు పోలీసుల అదుపులో ఉన్నారు. ఐదుగురు విద్యార్థులను బలిగొన్న ఈ గ్యాంగ్‌పై.. ఈ సారైనా కఠిన చర్యలు తీసుకుంటారో.. గతంలో వలే వదిలేస్తారో చూడాలి.

లోతుగా దర్యాప్తు..

ఈ ముఠా గురించి పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు సోమవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కృష్ణారావు వచ్చి కేసు వివరాలపై ఆరా తీశారు. పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా వచ్చి కేసు గురించి ఆరా తీశారంటే కేసు తీవ్రత ఎక్కువగానే ఉన్నట్లు భావిస్తున్నారు. పోలీసులు ఈ ముఠాకు సంబంధించిన పూర్తి వివరాలు రాబట్టే పనిలో ఉన్నారు.

వందేభారత్ రైలు వేళల్లో మార్పు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వారంలో ఆరు రోజుల పాటు తెనాలి మీదుగా ప్రయాణించే చెన్నై సెంట్రల్-విజయవాడ-చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికను ఈ నెల 15వ తేదీ నుంచి మార్పు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైలును నర్సాపూర్ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కారణంగా కాలమాన పట్టికలో మార్పు చేసినట్లు పేర్కొంది. రైలు నంబరు 20678 నర్సాపూర్-చెన్నై సెంట్రల్ వందేభారత్ రైలు ఈ నెల 15వ తేదీ నుంచి మధ్యాహ్నం 2.50కి బయలుదేరి తెనాలికి సాయంత్రం 5.19కి వచ్చి 5.20కి బయలుదేరి రేణిగుంటకు రాత్రి 9.50కి, చెన్నై సెంట్రల్‌కు 11.45కి చేరుకొంటుంది. రైలు నంబరు 20677 చెన్నై సెంట్రల్-నర్సాపూర్ వందేభారత్ రైలు ఈ నెల 17వ తేదీ నుంచి వేకువజామున 5.30కి బయలుదేరి 7.05కి రేణిగుంట, 11.21కి తెనాలి, 11.45కి విజయవాడ, మధ్యాహ్నం 2.10కి నర్సాపూర్ చేరుకుంటుంది. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

రూరల్ ఎస్ఐ వీఆర్‌కు బదిలీ

పొన్నూరుటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు రూరల్ ఎస్ఐ గండు కిరణ్ బాబు వీఆర్‌కు సోమవారం బదిలీ అయ్యారు. రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న కిరణ్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా రేషన్ బియ్యం అక్రమార్కులకు సహకరిస్తున్నారని ఇద్దరు రూరల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన పోలీసు ఉన్నతాధికారులు ఎస్సైను వీఆర్‌కు బదిలీ చేయడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. బదిలీ అయిన ఎస్ఐ స్థానంలో కొత్త ఎస్ఐ నియామకం చేపట్టలేదు.

వైభవంగా యువజనోత్సవం

● కళాకారులతో ఏఎన్‌యూ కళకళ ● విద్యార్థులు చదువుతో పాటు కళలలోనూ రాణించాలి: వీసీ

ఏఎన్‌యూ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతల మధ్య ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యువజనోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వర్సిటీ ప్రాంగణం కళాకారులతో కళకళ లాడింది. ఈ ఉత్సవ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు కళలలోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు జీవితంలో తమ కళా ప్రతిభను నెమరు వేసుకోవడానికి యువజనోత్సవం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ప్రత్యేక గౌరవ అతిథిగా విచ్చేసిన మిమిక్రీ ఆర్టిస్ట్ కె.కృష్ణం రాజు మాట్లాడుతూ, విద్యార్థులు తమలోని సృజనాత్మక తతో పాటు కళా ప్రతిభను వెలికి తీయడానికి ఈ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. యువజనోత్సవం సమన్వయకర్త ఆచార్య ఎస్.మురళీమోహన్ మాట్లాడు తూ, యువజనోత్సవం పోటీలకు 22 కళాశాల నుంచి 400 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకు న్నారని తెలిపారు. పోటీలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారు డు కృష్ణం రాజు చేసిన మిమిక్రి అందరిని ఆకట్టుకుంది. అనంతరం కృష్ణంరాజును ఊపకులపతి గంగాధరరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విశ్వవిద్యాలయం తాత్కాలిక రెక్టార్ ఆచార్య ఆర్.శివరా మప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, పాలకమండలి సభ్యులు ఆచార్య కె.సుమంత్ కుమార్, సైన్స్, వ్యాయామ, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య వీరయ్య, పాల్ కుమార్, తేజోమూర్తి, కమిటీ మెంబర్లు డా శశిధర్, డా ఎం బాబు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యువజన ఉత్సవాల్లో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు



విద్యార్థినుల సెల్ఫీ

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ముందస్తు ఒప్పందం లేకుండా బర్లీ పొగాకు సాగు వద్దు: ఏవో

యడ్లపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొగాకు కంపెనీల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోకుండా నల్ల, తెల్ల బర్లీ పొగాకు సాగు చేపట్టవద్దని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించారన్నారు ఈ మేరకు జిల్లా కలెక్టరు, వ్యవసాయశాఖలు రైతులు పొగాకు సాగు చేపట్టకుండా ఆదేశాలు జారీచేశారన్నారు. ఇందుకోసం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ ఆదేశాలను దిక్కరించి ఎవరైనా సాగుచేస్తే టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పంటను తొలగిస్తారని హెచ్చరించారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలు నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

పోట్లూరు సర్పంచ్‌పై డీపీవోకు ఫిర్యాదు

శావల్యాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలనపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న శావల్యాపురం మండలం పోట్లూరు సర్పంచ్ పోపూరి జ్యోతిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నర్సరావుపేటలోని డీపీవో కార్యాలయంలో సోమవారం పోట్లూరు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌పై తగినచర్యలు తీసుకొని గ్రామపాలనను గాడిలో పెట్టాలని డీపీవోని కోరారు. స్పందించిన డీపీవో ఫిర్యాదును డిప్యూటీ ఎంపీడీవోకి పంపి సర్పంచ్ తీరుపై విచారణ చేయాలని ఆదేశించారు.

ఆర్వో ప్లాంట్‌లకు అనుమతులు తప్పనిసరి: కమిషనర్

వినుకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ొనరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకొని మాత్రమే ప్లాంట్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ ఆదేశించారు. పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులతో కమిషనర్ సుభాష్ చంద్రబోస్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మినరల్ వాటర్ టేస్ట్ కోసం కలుపుతున్న రసాయన లిక్విడ్ వలన జీర్ణకోశ సంబంధిత సమస్యలు వస్తున్నాయని, ఆ లిక్విడ్ కలపకుండా చూడాలన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి ల్యాబ్ రిపోర్ట్‌ను మున్సిపల్ కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, అసిస్టెంట్ ఇంజనీర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నరసరావుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగులందరికి వేతన సరవణ వెంటనే అమలు చేపట్టాలని పీఏసీఎస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం జీడీసీసీ బ్యాంక్ నరసరావుపేట బ్రాంచ్‌లో పీఏసీఎస్ ఉద్యోగులు బ్రాంచి చీఫ్ మేనేజర్ ఎస్ రమాదేవి, క్లస్టర్ ఏజీఎం బీ సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు.

● యడ్లపాడు: యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ పోటీలలో సత్తా చాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా సనవాడలో ఈ నెల 6, 7 తేదీలలో రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలు జరిగాయి.

● నరసరావుపేట టౌన్: దివ్యాంగుల హక్కుల చట్టం 2016పై సోమవారం పుస్తకం విడుదల చేశారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశం మందిరంలో కలెక్టర్ కృతికా శుక్లా పుస్తకాన్ని విడుదల చేశారు.

● వినుకొండ టౌన్: త్రైతసిద్ధాంత భగవద్గీతపై మండలంలోని విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు.

● నరసరావుపేట టౌన్: జేఎన్‌టీయూ కాకినాడలో ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహించే సౌత్‌జోన్ పురుషులు వాలీబాల్ పోటీలకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ జట్టు సిద్ధమైందని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. గత నెల 27న కృష్ణవేణి డిగ్రీకళాశాల క్రీడా ప్రాంగణంలో జట్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు.

● నరసరావుపేట టౌన్: జాతీయ స్థాయి ఫార్మసీ క్రీడా పోటీలలో ఏఎంరెడ్డి ఫార్మసీ విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ్‌భూషణరావు సోమవారం తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో జరిగిన పోటీలలో ఏఎంరెడ్డి విద్యార్థులు ఖో-ఖోలో మొదటి స్థానంలో నిలిచారన్నారు.

● నరసరావుపేట రూరల్: సైనికుల సంక్షేమం కోసం నిర్వహించే సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు.

● నూజెండ్ల: మండల, గ్రామ సచివాలయ, వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తాళ్ళూరు మండలం రాయపూడి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న మల్లిఖార్జునరావు ఉద్యోగోన్నతిపై నూజెండ్లకు బదిలీ అయ్యారు.

● కనమర్లపూడి (శావల్యాపురం): గుంటూరు ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 23వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలోని సంసిద్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి 18పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సాగర్‌బాబు సోమవారం తెలిపారు.

● శావల్యాపురం: స్థానిక జడ్పీపాఠశాల్లో భారతీయ భాషా దినోత్సవంను సోమవారం నిర్వహించారు. హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు.

● చిలకలూరిపేట: పసుమర్రు బైపాస్ మార్గంలో మద్దుకూరి గార్డెన్స్‌లో ఆల్ఫా హెల్త్, ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాన్ని సోమవారం డాక్టర్ గట్టి రంగారావు దంపతులు ప్రారంభించారు.

● నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళలో నరసరావుపేట డీఎస్పీ వెంకటరమణ సోమవారం సాయంత్రం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ జరిపారు.

ప్రజా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

● అధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను అధికారులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి 134 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్ఆర్‌కేటీ కాలనీ ప్రజల ఆందోళన

నరసరావుపేట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశానుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్‌కేటీ కాలనీలో తాగునీరు, రోడ్లు, వీధి లైట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఎస్ఆర్‌కేటీ కాలనీ ఏర్పడి 22ఏళ్ళు గడుస్తున్నా నేటికి కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఉన్నతాదికారులు దృష్టిపెట్టి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

అనాథలకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

నర్సరావుపేట లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని అనాథలు, నిరాశ్రయుల కోసం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని విస్తరించినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల సోమవారం తెలిపారు. వారికి ఉచిత వైద్యం అందించే దిశగా జిల్లాలోని శిశు గృహ సంరక్షణ కేంద్రాల్లోని 45 మంది అనాథ పిల్లలకు అమృత ఆరోగ్యశ్రీ కార్డులను సోమవారం ఆమె తన కార్యాలయంలో అందజేశారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

బొల్లాపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిగనుమల సర్వే నెంబరు 430లో ప్రభుత్వ బంజరు భూమి 150 ఎకరాలు భూమి ఉందని, దీనిని ప్రభుత్వం పేద గిరిజనులకు పంచాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక పీడీఎం తదితర ప్రజా సంఘాలు పలు మార్లు జిల్లా కలెక్టర్‌కు అర్జీలు ఇవ్వటం జరిగిందని, దీనిలో భాగంగానే సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ కోటయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటానాయక్, డీ శ్రీను నాయక్, బీ రాంబాబు నాయక్, షేక్ మస్తాన్ రావు, నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 134ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సంతోష్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ అంశాలకు సంబంధించి మొత్తం 134 ఫిర్యాదులు అందాయి. నరసరావుపేటకు చెందిన ఫిర్యాది చిట్టీ పాడతా వచ్చిన నగదు 18 లక్షల మొత్తం తనకు పరిచయం ఉన్న ఓ మహిళకు ప్రామిసరీ నోటు చెక్కులు ష్యూరిటీగా తీసుకొని ఇచ్చినట్లు పేర్కొన్నారు. తదుపరి తన నగదును తిరిగి అడగగా బెదిరించటంతో, ప్రామిసరీ నోటు చెక్కులు పరిశీలించగా సంతకాలు మార్చి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. పట్టణంలోని అరండల్ పేటకు చెందిన ఓ ఫిర్యాది తమ్ముడు ఇల్లు కొనుకుంటుంటే బంగారం తనఖా పెట్టి ఇచ్చానని, తమ్ముడు నగదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని విచారించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో క్రైమ్ అదనపు ఎస్పీ లక్ష్మీపతి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు .

నరసరావుపేటలో జిల్లా స్థాయి పారా ఒలింపిక్స్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట్లలోని శంకర భారతిపురం జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో డిస్ట్రిక్ట్ లెవల్ వన్‌డే స్పోర్ట్స్ పారా ఒలింపిక్స్ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, సమగ్ర శిక్ష వికలాంగుల పారా ఒలింపిక్స్ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి దాదాపు 300 మంది వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ సమాజంలో మానసిక వికలాంగులు ఎక్కువ శాతం ఉన్నారన్నారు. జిల్లాలో భవిత సెంటర్ల ప్రాధాన్యంను వివరిస్తూ వికలాంగ విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 6,000 మంది వికలాంగ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. 28 మండలాల్లో భవిత సెంటర్లు ఉన్నాయని, వీటి ద్వారా వికలాంగులకు అవసరమైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎస్ఎస్ఎన్ కళాశాల కమిటీ అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పారా ఒలింపిక్స్ క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే క్రీడా ప్రాంగణాన్ని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరుపుకునేందుకు అనుమతి ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఏఆర్టీ కేంద్రానికి ఉత్తమ పురస్కారం



సిబ్బందిని అభినందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగులకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను జాతీయస్థాయిలో పల్నాడు జిల్లా నరసరావుపేట ఏఆర్‌టీ కేంద్రానికి ఉత్తమ పురస్కారం లభించింది. ఈ మేరకు ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఈ నెల 1న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె నీలకంఠరెడ్డి నరసరావుపేట ఏ ఆర్ టి కేంద్ర వైద్యురాలు డాక్టర్ శారదకి పురస్కార పత్రాన్ని అందజేశారు. సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఏఆర్టీ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మాధవిలత, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, ఏఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయాధికారుల సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్యాంబాబు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థాన భవనాల ఆవరణలో ఈ నెల 13న స్థానిక నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై సోమవారం స్థానిక న్యాయవాద సంఘ కార్యాలయంలో న్యాయవాదులతో న్యాయధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్చార్జి న్యాయాధికారి శ్యాంబాబు న్యాయవాదులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయధికారులు కే మధుస్వామి, ఎన్.లావణ్య, ఏ నలోమి, న్యాయవాద సంఘ అధ్యక్షుడు గన్నే వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు యువత ముందుకు రావాలి

● రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్



పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ రాంప్రసాద్

వినుకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న అంతర్జాతీయ రోటరీ సంస్థలో యువత భాగస్వామ్యం పెంచేందుకు కృషిచేయాలని రోటరీ క్లబ్ 3150 జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ అన్నారు. కారంపూడి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో వినుకొండ రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏరువ నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో రాంప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా క్లబ్ కార్యక్రమాలపై సమీక్షించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా తొలుత ఎన్ఎస్‌పీ కాలనీలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గంగినేని రామయ్య, రోటరీ క్లబ్ సంయుక్తంగా సుమారు రూ.3లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. నూజెండ్ల మండలం తెల్లబాడు పాఠశాలకు ఫ్యాన్లు పంపిణీ చేశారు. అనంతరం 2026 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు

సహకార పరపతి సంఘాల ఉద్యోగుల నిరసన



వినుకొండ సహకార బ్యాంక్ వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

వినుకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న సహకార బ్యాంక్ బ్రాంచిలో సోమవారం మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.వి.నారాయణ, ప్రధానకార్యదర్శి పోకా కోటేశ్వరరావు, కార్యదర్శి ప్రేమనాథ్‌ప్రకాష్, ఉమ్మడి గుంటూరు జిల్లా యూనియన్ ఉపాధ్యక్షుడు జాలాది నాగప్రసాద్, సీఈవోలు, సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులో జరిగిన నిరసన కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, దీపక్, మల్లికార్జున, సాంబయ్య, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: సమస్యల పరిష్కారం కోరుతూ సహకార కేంద్ర బ్యాంకు చిలకలూరిపేట బ్రాంచి ఎదుట ఉద్యోగులు సోమవారం ధర్నా చేశారు. యడ్లపాడు, సొలస, నాదెండ్ల, గణపవరం, కొమరవల్లిపాడు, మురికిపూడి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి రూ.15 లక్షల విరాళం

చిలకలూరిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి సీసీఎల్ ప్రొడక్ట్స్ (కాంటినెంటల్ కాఫీ సంస్థ) వ్యవస్థాపకులు, పారిశ్రామికవేత్త చల్లా రాజేంద్రప్రసాద్ రూ.15 లక్షల సోమవారం విరాళమందించారు. ఈ సందర్భంగా చల్లా రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సత్కరించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ (సీఎస్ఆర్ నిధులు)లో భాగంగా తమ సంపాదనలో ఎంతోకొంత పేదల అభ్యున్నతికి వినియోగించి, సమాజ ప్రగతికి తోడ్పాటు అందిస్తున్నందుకు అభినందించారు.

విద్యా ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం: చీఫ్ విప్ జీవీ

వినుకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలను పెంచటమే ప్రభుత్వ లక్ష్యమని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక తిమ్మాయిపాలెం రోడ్డులోని వైకన్వెన్షన్ హాల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేట్ ఫస్టు ర్యాంక్ సాధించిన వినుకొండ విద్యార్థికి శివశక్తి ఫౌండేషన్ ద్వారా రూ.3లక్షలు, అదేవిధంగా జిల్లా స్థాయిలో మొదటి స్థానం వస్తే రూ.2లక్షలు, నియోజకవర్గ స్థాయిలో ఫస్టు వస్తే రూ.లక్ష రూపాయలు అందచేస్తామని హామీ ఇచ్చారు. స్టేట్ ఫస్టు సాధించేందుకు పాటుపడిన పాఠశాల ఉపాధ్యాయులను సింగపూరు ట్రిప్పు ఏర్పాటు చేస్తామన్నారు. మూడు సంవత్సరాల వ్యవధిలో బెస్టు ఉపాధ్యాయులను సింగపూర్ పంపిస్తామన్నారు. క్యాక్రమంలో మండ స్థాయి ఎంఈవోలు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు జీవీ పరామర్శ

నూజెండ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు జీ యశ్వంత్ సాయి, వీ వాసుల తల్లిదండ్రులను ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం గ్రామానికి వెళ్ళి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి పరామర్శించారు. కార్యక్రమాల్లో జనసేన నాయకులు నాగశ్రీను రాయలు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి, ఎరబిక్కి వెంకటరావు, సోమేపల్లి బ్రహ్మయ్య, కుంటా కోటిరెడ్డి, గంగినేని చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

బుర్రిపాలెం పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

నూజెండ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రిపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్.రవిచంద్ర, హెచ్ఎం కృష్ణారావు, ఉపాధ్యాయులు రంగారావు, యలమందరావు, దుర్గేశ్వరరావు పాల్గొన్నారు.

రావిపాడులో ఘనంగా అమలోద్భవి మాత మహోత్సవం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాడులోని అమలోద్భవి మాత చర్చి పండుగ సోమవారం ఘనంగా నిర్వహించారు. గత 10 రోజులుగా మహోత్సవాలు జరగ్గా చివరి రోజున సమిష్టి దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు ఆలయ విచారణ గురువు మొదటిపూజతో మహోత్సవం ప్రారంభమైంది. మహోత్సవాలలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. రాత్రి గ్రామం తేరు ప్రదక్షిణలో బాణ సంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నరసరావుపేట రూరల్ సీఐ ఎం. సుబ్బారావు, ఎస్ఐ కిషోర్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వినుకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంను వెనుక నుంచి కారు బలంగా ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని విఠంరాజు పల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ మండలం నరగాయపాలెంకు చెందిన మాలపాటి చిన్న వెంకటేశ్వరరెడ్డి, భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై విఠరాజుపల్లి గ్రామంలోని కుమార్తె వద్దకు వెళ్లారు. భార్య మల్లేశ్వరిని కుమార్తె ఇంటి వద్ద దించి, చికెన్ తీసుకు వస్తానని ద్విచక్రవాహనంపై వినుకొండ వచ్చి తిరిగి వెళ్తుండగా విఠంరాజు పల్లి గ్రామ సమీపంలో కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి వచ్చిన వందలాది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటున్నారు.

పలు సమస్యలపై సీఎంకు ప్రత్తిపాటి వినతి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం అందచేస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎకో హెరిటేజ్, టెంపుల్ టూరిజం అభివృద్ధికి అత్యధిక అవకాశమున్న కొండవీడు కోట సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కొండవీడు కోటకు టీడీపీ హయాంలో నిర్మించిన ఘాట్ రోడ్డును చౌడవరం నుంచి జాతీయ రహదారికి (ఎన్.హెచ్-16) అనుసంధానించేందుకు మధ్యలో టన్నెల్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని ప్రత్తిపాటి సీఎంకు వివరించారు. చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో రూ.18 కోట్లతో నిర్మించతలపెట్టిన మైనారిటీ బాలికల పాఠశాల నిర్మాణాన్ని గత ప్రభుత్వం అటకెక్కించిందని, వీలైనంత త్వరగా పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. పొగాకు రైతుల బకాయిలు, పత్తి కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ముఖ్యమంత్రికి వివరించారు.

తోడేలు లాంటివాడు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఒక మానసిక వికలాంగుడు, మనుషులలో తిరిగే తోడేలులాంటి వాడని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అరవిందబాబు మాట్లాడుతూ అవినీతి మచ్చలేకుండా, దుర్మార్గ ఆలోచనలు లేకుండా ఉన్నానన్నారు. కుట్రపూరితంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై ఆరోపణలు సరికాదన్నారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించినట్లు జనరిక్ షాప్, మెడికల్ షాపులనుంచి డబ్బులు ఎప్పుడూ వసూలు చేయలేదన్నారు. కరోనా సమయంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఇంజక్షన్లు అమ్ముకున్న చరిత్ర ఉందని, దానికి నేనే ప్రత్యక్ష సాక్షిని అన్నారు. ఇంజక్షన్ల మీద ఆయనకు దాదాపు రూ.20 కోట్లు ఆదాయం వచ్చిందని ఆరోపించారు. సమావేశంలో కూటమి నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, శేఖర్, పులుకూరి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేయకపోతే డాక్టర్‌ను ఎందుకు సస్పెండ్ చేశారు

● వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ తప్పు చేయకపోతే ప్రభుత్వం ఎందుకు సస్పెండ్ చేసిందని వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీగా మేము ప్రజా సమస్యల్ని మీడియా ద్వారా మీకు తెలియజేస్తామన్నారు. చేతనైతే సరిచేయాలని వ్యక్తిగత దూషణలకు దిగటం సరైన పద్ధతి కాదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్ని వెనకేసుకొస్తుండటంపై ప్రశ్నించారు. నరసరావుపేట పట్టణంలో ఎంతోమంది అల్లోపతి డాక్టర్లు ఉండగా ఒక ఆయుర్వేద డాక్టర్ని తీసుకొచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి చైర్మన్‌గా ఎందుకు చేశావు అని ప్రశ్నించారు. మా ప్రభుత్వ హయాంలో ఆసుపత్రిలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై దర్యాప్తు చేసి నిరూపించాలని సవాల్ చేశారు.

ప్రజల ఆలోచనలకు అనుగుణంగానే విద్యా బోధన: ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలకు అనుగుణంగానే మెరుగైన విద్యా విధానాన్ని మంత్రి లోకేశ్ ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండల కేంద్ర మైన నాదెండ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ప్రాంగణంలో అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాలకు రూ.69.30లక్షల వ్యయంతో నిర్మించనున్న ల్యాబ్ భవనాల నిర్మాణ పనులకు పుల్లారావు సోమవారం శంకుస్థాపన చేశారు.

కేఎస్ఆర్ నేతాజీ మిత్రమండలి సేవలు ప్రశంసనీయం: ఎమ్మెల్సీ రాజశేఖర్

యడ్లపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న కేఎస్ఆర్ నేతాజీ మిత్రమండలి సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. సోమవారం యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటలోని మాతా సేవా సంస్థకు కేఎస్ఆర్ నేతాజీ మిత్రమండలి సభ్యులు రూ.50వేల విలువైన ఎల్ఈడీ టీవీని ఎమ్మెల్సీ చేతుల మీదుగా బహూకరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేఎస్ఆర్ నేతాజీ మిత్రమండలిని స్థాపించి నిరుపేదలకు, విద్యార్థులకు ఎనలేని సేవలు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులకోసం ఉపకార వేతనాలు, ల్యాప్‌టాప్‌లు ఇవ్వడం గొప్ప విషయమన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలి: ఎంపీడీవో

శావల్యాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్తీలేని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని, ప్రజలంతా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులనే వాడాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. మండలంలోని వేల్పూరుకు చెందిన మహేష్ బయో ఇన్పుట్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు.

ఎస్టీయూ ఉపాధ్యాయవాణి జిల్లా కన్వీనర్‌గా రాజారమేష్

శావల్యాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయవాణి జిల్లా కన్వీనర్‌గా శావల్యాపురం మండలం తుమ్మలకుంట ప్రాథమిక పాఠశాల్లో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బిళ్లా రాజారమేష్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.